


## కాకాణి ఓ దిష్టిబొమ్మ.. మంత్రులు, అధికారులతో రైతులు నష్టపోయారు



**నెల్లూరు నవంబర్ 17, ప్రభాతవార్త-వైద్యం** కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఓ దిష్టిబొమ్మని ఆయన చేతకానితనంతో జలనిధిగా ఉన్న ఈ జిల్లాలో కూడా వరి పంట సాగుచేసుకునే పరిస్థితి లేకుండాపోయిందని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం నగరంలోని టీడీపీ జిల్లా కేంద్ర కార్యాలయంలో సోమిరెడ్డి విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ పుణ్యమాని ఈ జిల్లా జలనిధిగా మారిందన్నారు. ఉమ్మడి ఏపీలో 7లక్షల ఎకరాలు పండించే అవకాశాన్ని ఎన్టీఆర్ కల్పించాడన్నారు. 70ఏళ్ళ తరువాత వైసీపీ మంత్రుల పుణ్యమాని నీళ్ళ కోసం రైతులు వెతుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. లక్ష ఎకరాలకు 40టీఎంసీల నీరు విడుదల చేశారని, 30టిఎంసీల నీరు వృధా అయ్యిందన్నారు. ఇరిగేషన్, అగ్రికల్చర్ అధికారుల లెక్కలకు పొంతన కుదరడం లేదన్నారు. వ్యవసాయశాఖామంత్రి కాకాణి ఒక యంత్రంగా మారిపోయాడన్నారు. గోవర్ధన్‌రెడ్డికి ధనదాహం తప్ప రైతుల కష్టాలు కనిపించకుండాపోయాయని చంద్రమోహన్‌రెడ్డి మండిపడ్డాడు. కావాలనే వ్యవసాయశాఖాధికారిని కాకాణి గోవర్ధన్‌రెడ్డి సరెండర్ చేశాడని ఆరోపణలు చేశాడు. సరెండర్ చేయాల్సింది వ్యవసాయశాఖాధికారిని కాదని, వ్యవసాయశాఖామంత్రిని అని సీఎం జగన్‌కి లేఖ రాస్తున్నానని చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. కేవలం అధికారులు, మంత్రుల నిర్లక్ష్యం వల్లే రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వెంటనే వారికి నష్టపరిహారం చెల్లించాలని సోమిరెడ్డి డిమాండ్ చేశాడు. డ్యాన్సులు వేసే సమయం ఉన్న అంబటి రాంబాబుకి, అన్యాయం అవుతున్న నెల్లూరు జిల్లా రైతుల సమస్యలపై రివ్యూ మీటింగ్ నిర్వహించే సమయం లేదాని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇద్దరు మంత్రులు చర్చకు వచ్చినా, ప్రజల పక్షాన నేను ఒక్కడినే చర్చకు వచ్చేందుకు సిద్ధమని ఆయన సవాల్ విసిరారు.

## వ్యాగిన్ల మరమ్మతుల కోసం లూప్‌లైన్ల ఏర్పాటుపై పరిశీలన



**బిట్రగుంట, నవంబరు 17 ప్రభాతవార్త** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని బిట్రగుంట రైల్వే యార్డులో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ ఆదేశాల మేరకు వ్యాగన్ల మరమ్మతుల కోసం లూప్‌లైన్లు ఏర్పాటు చేసేందుకు రైల్వే ఉన్నతాధికారుల బృందం పరిశీలించింది. యార్డులో ఎగువ,దిగువ మార్గాలలో ఈ లైన్లు ఏర్పాటు చేయాలని రైల్వే ఉన్నతాధికారులు నిర్ణయించుకున్నారు. అల్లూరు రోడ్డు నుండి బిట్రగుంట వరకు, శ్రీ వెంకటేశ్వరపాళెం నుండి బిట్రగుంట వరకు వీటిని ఏర్పాటు చేయాలని రైల్వే వర్గాల ద్వారా తెలిసింది. మరమ్మతుకు గురైన వ్యాగిన్లను షట్టింగ్ చేసి ఈ లూప్‌లైన్‌లో వుంచి మిగిలిన గూడ్సు వ్యాగిన్లను నేరుగా పంపించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. మరమ్మతులకు గురైన వ్యాగన్ల రిపేరు కోసం టిఎక్స్ఆర్ డిపోని విస్తరించే అవకాశం వుంది. అందులో భాగంగా రైల్వే ఉన్నతాధికారులు వెయింగ్ డిపోను కూడా పరిశీలించారు. డివిజనల్ రైల్వే ఉన్నతాధికారుల వెంట స్థానిక ఇంజనీరింగ్ అధికారులు కూడా పాల్గొన్నారు.

## బీఎల్‌వోలు బాధ్యతగా విధులు నిర్వహించాలి



**కోవూరు, నవంబరు 17 ప్రభాతవార్త :** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బూత్ లెవల్ అధికారులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న వారు వారికి కేటాయించిన విధులు, బాధ్యతలను పారదర్శకంగా నిర్వహించాలని నుడా వైస్ చైర్మన్ , కోవూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బాపిరెడ్డి అన్నారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన తహసీల్దార్, రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల నుంచి పర్మినెంట్‌గా వేరే ప్రాంతాలకు వెళ్లిన వారు, మృతిచెందిన వారి ఓట్లు తొలగించే విషయంలో ఎన్నికల కమిషన్ నియమనిబంధనల మేరకు లోబడి పారదర్శకంగా చేపట్టాలన్నారు. ప్రతి కేంద్రం పరిధిలోని బీఎల్‌వోలు వారి వారి పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు నమోదు చేసుకునేలా వారిలో అవగాహన పెంచాలన్నారు. నూతనంగా ఓట్లు నమోదు చేసుకునేందుకు డిసెంబర్ 9వ తేది వరకు అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. పద్మజ, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ మధు, డిప్యూటీ తహసీల్దార్ ఇలియాజ్, సీనియర్ అసిస్టెంట్ సుధా, తదితరులు ఉన్నారు.

## లిఖిత నృత్య నిలయానికి దాతృత్వం చాటుకున్న బియంఆర్

**కావలి రూరల్, నవంబరు 17 ప్రభాతవార్త** కావల పట్టణం సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర కుమార్తె లిఖిత నిర్వహిస్తున్న సంయుక్త నృత్య కళానిలయం అద్దెకు సంబంధించి రాజ్యసభ సభ్యులు, కావలి మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు బియంఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా 30 వేల రూపాయలు పంపించి దాతృత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా లిఖిత మాట్లాడారు. ఏప్రిల్‌లో జరిగిన సంయుక్త సేవా సంస్థ వారోత్సవంలో బీద మస్తాన్‌రావు పాల్గొని సంయుక్త నృత్య నిలయానికి అవసరమైన అద్దెను బియంఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందజేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ఆరు నెలల అద్దెకు సంబంధించి 30 వేల రూపాయలు ఈ రోజు పంపారన్నారు. అంతేకాకుండా బియంఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా త్వరలో సంయుక్త నృత్య కళానిలయాన్ని నిర్మిస్తానని నిర్మాణం పూర్తయ్యే వరకు తన ట్రస్ట్ ద్వారా అద్దె చెల్లిస్తానని బీద మస్తాన్‌రావు చెప్పారని తెలిపారు. ఆయనకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని తెలిపారు.

## బీసీలు ఆర్థికంగా రాజకీయంగా అభివృద్ధి చెందాలి




**నెల్లూరు నవంబర్ 17, ప్రభాతవార్త-వైద్యం** ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బీసీలు ఎంతో అభివృద్ధి చెందాలని అఖిల పక్షనేతలు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని మినిబైపాస్‌రోడ్డులో ఉన్న మహేశ్వరి పరమేశ్వరి కళ్యాణమండపంలో టీడీపీ నెల్లూరు జిల్లా బీసీ విభాగం ఆధ్వర్యంలో బీసీలకు వైసీపీ ప్రభుత్వం చేస్తున్న నమ్మకద్రోహంపై కుల సంఘాలు, అఖిలపక్షాలతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీమంత్రి నిమ్మల కిష్టప్ప, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌అజీజ్, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్‌లు హాజరు అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరి నాయకత్వంలో బీసీలు అభివృద్ధి చెందారో, ఎవరి నాయకత్వంలో వెనుకపడ్డారో ఆలోచించాలన్నారు. బీసీ నాయకులను గుర్తించిన ఏకైకపార్టీ టీడీపీయేనన్నారు. రూ.18వేలకోట్లు లోటుబడ్జెట్ ఉన్నప్పుడు ఏపీని గాడిలో పెట్టిన ఘనుడు చంద్రబాబన్నారు. ఎన్ని తప్పులు చేసినా నాయకత్వాన్ని సమర్థించమని జగన్ అంటున్నాడన్నారు. జిల్లాలో స్థిరమైన నాయకులను తయారు చేసింది టీడీపీయేనన్నారు. బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసింది టీడీపీయేనన్నారు. బీసీ భవన్ నగరంలో ఉండాలని నగర నడిబొడ్డులో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించతలచామని, చేసే మనసు ఉండే నాయకుడు సీఎంగా ఉండబట్టే అది సాధ్యమైందని బీద రవిచంద్ర పేర్కొన్నారు. టీడీపీ హయాంలో ప్రతి జిల్లాకు బీసీ భవన్ మంజూరు చేశామన్నారు. అనిల్‌కుమార్ మంత్రిగా ఉండి బీసీ భవన్‌ని పూర్తి చేయలేకపోయాడన్నారు. రూ.75వేల కోట్లు బీసీ సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్ళిస్తే అడిగే ధైర్యం వైసీపీ నాయకులకు లేదని రవిచంద్ర విమర్శించాడు. అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ టీడీపీ హయాంలో చేతివృత్తుల వారి స్వయం ఉపాధి పెంచడానికి ఆదరణ పథకాన్ని తీసుకొచ్చామన్నారు. ఆధునిక పరికరాలు అందించిన ఘనత చంద్రబాబుదన్నారు. వైసీపీ నేతలు పనిముట్లను తుప్పు పట్టించారే తప్ప ప్రజలకు ఇవ్వలేదని మండిపడ్డాడు. బీసీలకు ప్రాంతాలవారీగా వేర్వేరు సమస్యలు ఉన్నాయని, వారికి అండగా టీడీపీ ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎదిరించే పార్టీ టీడీపీ మాత్రమేనని అబ్దుల్ అన్నారు. రాక్షస ప్రభుత్వాన్ని ఎదుర్కొనేందుకు అఖిలపక్షాలు ఇప్పుడు ముందుకు రావడం సంతోషకంగా ఉందన్నారు. చంద్రబాబు అవసరం రాష్ట్రానికి ఎంతో ఉందన్నారు.

## కన్నుల పండుగగా శ్రీ మల్లికార్జునస్వామి,కామాక్షితాయి కళ్యాణం



**బుచ్చి నవంబర్ 17 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి సన్నిధిలో కార్తీకమాసం పర్వదినాలలో శుభశుక్రవారం రోజున కళ్యాణ మహోత్సవం కన్నుల పండగగా నిర్వహించారు. భక్తులు స్వామి అమ్మవార్ల కళ్యాణం చూసి పరవశించారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రమణ్యంనాయుడు, ఆలయ ఇఒ విరుపార్షుల గిరికృష్ణ పర్యవేక్షించారు. భక్తులకు తీర్ధప్రసాదాలు అందజేశారు.

# పార్టీలకు అతీతంగా సంక్షేమాభివృద్దే జగన్ లక్ష్యం




**పొదలకూరు నవంబర్ 17 ప్రభాతవార్త** పార్టీలకు అతీతంగా రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం దిశగా వైసిపి ప్రభుత్వం అడుగులు వేస్తుందని అదే సిఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం అని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కున్నారు. నెల్లూరు జిల్లాకు సంబందించి వ్యవసాయ భూమి హక్కు పత్రాల పంపిణి కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. పొదలకూరు పట్టణంలోని పి.వి.ఎన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఈకార్యక్రమాన్ని ప్రారంభించి రైతులకు భూమి హక్కు పట్టాలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల 24 వేల 709 కుటుంబాలకు ఈ పట్టాలు పంపిణి చేస్తున్నామని అన్నారు. రైతులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ మంచి కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. రైతుల చిరకాల కోరిక నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనుక్షణం రైతుల బాగోగుల గురించి ఆలోచించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. చుక్కల భూముల సమస్యకు పరిష్కారం చెప్పిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. పొదలకూరు మండలంలో 4వేల 372 మంది లబ్ధిదారులకు 6819 ఎకరాల భూములకు శాశ్వత హక్కులు కల్పిస్తు పట్టాలు పంపిణి చేశామన్నారు. ప్రతిపక్షాలు సృషించే అడ్డంకులను అదిగమించి పేదలకు రైతులకు న్యాయం చేస్తున్నామని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఎం .హరినారయణ్ మాట్లాడుతు జిల్లాలో సుమారు 25 వేల మంది రైతులకు వివిద భూములకు సంబందించిన హక్కులు కల్పిస్తు పట్టాలు పంపిణి చేస్తున్నామని అన్నారు. అర్హులైన ప్రతి రైతుకు పట్టాలు పంపిణి చేయడమే లక్ష్యమని తెలిపారు. జడ్పి చైర్‌పర్సన్ అరుణమ్మ, జాయింట్ కలెక్టర్ కూర్మనాద్, మండల ప్రజాప్రతినిదులు, వివిధ శాఖల అధికారులు, లబ్దిదారులు, రైతులు, మండల వైకాపానాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దు



**నెల్లూరు క్రైమ్, నవంబర్ 17, ప్రభాతవార్త** డీజీపీ ఆదేశాల మేరకు నగరంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌నకు ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిధిగా విచ్చేసి పోలీసు అధికారులు, సిబ్బంది నిర్వహించిన గౌరవ వందనం స్వీకరించి తదుపరి కవాతును వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం కొరకు ప్రతి ఒక్కరూ ఒత్తిడిని తగ్గించుకుంటూ వ్యాయామం చేస్తూ తరచుగా హెల్త్ చెకప్ చేయించుకోవాలని వివరించారు. పోలీసులు విధి నిర్వహణతో పాటు ఆరోగ్యాన్ని అశ్రద్ద, నిర్లక్ష్యం చేయవద్దని, ప్రతి రోజు వారి వారి వయసును బట్టి, అన్ని నిమషాలు చమటోడ్చేలా వ్యాయామం, యోగా చేయాలని వివరించారు. 40 సంవత్సరాలు పైబడిన అందరూ తప్పక హెల్త్ చెకప్ చేయించుకుంటూ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. పోలీసు సిబ్బంది, కుటుంబ సభ్యుల సంక్షేమంలో భాగంగా త్వరలో పోలీసు గ్రౌండ్ నందు ప్రతి రోజు యోగా నిర్వహించడం జరుగుతుంది. అందరూ వినియోగించుకోగలరని తెలిపారు. అనంతరం పరేడ్ గ్రౌండ్ నందు సిబ్బంది సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పోలీసు సంక్షేమ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. అనంతరం సిబ్బందితో ముఖాముఖిగా మాట్లాడి గ్రేడ్ ఇంక్రిమెంట్, సీపీఎస్ నగదు, డిజర్షన్, బదిలీలు, ఈఎల్ఎఫ్‌పీ, భద్రత, కోఆపరేటివ్ లోన్, అనారోగ్యం తదితర అర్జీలను స్వయంగా స్వీకరించి నిశితంగా పరిశీలించి అడ్మినిస్ట్రేటివ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్)హిమవతి, క్రైమ్ ప్రసాద్, ఏఆర్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడా పోటీలలో క్రీడా స్ఫూర్తితో ఆడాలి

**కావలి రూరల్, నవంబరు 17 ప్రభాతవార్త** క్రీడా పోటీలలో క్రీడా స్ఫూర్తి ప్రదర్శిస్తూ ఆడాలని విక్రమ సింహపురి యూనివర్శిటీ ఉపకులపతి ప్రొఫెసర్ జి.యం.సుందరవల్లి విద్యార్థులకు పిలుపునిచ్చారు. కావలి పట్టణంలోని విక్రమ సింహపురి యూనివర్శిటీ కళాశాలలో శుక్రవారం విశ్వవిద్యాలయాల అంతర్‌కళాశాలల పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాలల నుండి వచ్చిన క్రీడాకారులను ఆమె పరిచయం చేసుకున్నారు. పోటీలకు వచ్చిన వారందరూ విజయాలను సాధించిన వారేనని క్రీడాకారులను అభినందించారు. మా సహాయ సహకారాలు ఎల్లవేళలా వుంటాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండు రోజుల పాటు బాల్‌బ్యాడ్మింటన్, వాలీబాల్, యోగా పోటీలు జరుగుతాయని తెలిపారు. క్రీడలకు ఉపకులపతి సుందరవల్లి ఎంతో తోడ్పాటు అందిస్తున్నారని తెలిపారు. క్రీడల నిర్వహణ కార్యదర్శి సి.హెచ్.మణికంఠ మాట్లాడుతూ వాల్‌బాల్ పోటీలకు 16 టీములు, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు 10 టీములు రావడం జరిగిందన్నారు. ఈ క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ పి.రామచంద్రారెడ్డి, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి సునీత, జవహర్ భారతి కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ ఆర్.మాల్యాద్రి, డాక్టర్ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# జగన్నాథ రథయాత్రను విజయవంతం చేయాలి



**కావలి, నవంబరు 17 ప్రభాతవార్త** కావలి పట్టణంలో డిసెంబరు 16వ తేది జరగనున్న శ్రీశ్రీశ్రీ గౌర నితాయ్ రథయాత్రను విజయవంతం చేయాలని నెల్లూరు ఇస్కాన్ మందిర పాలక వ్యవస్థ చైర్మన్ డాక్టర్ సుఖదేవ స్వామి మహరాజ్ పిలుపునిచ్చారు. కావలి పట్టణ రామమూర్తిపేటలోని ఇస్కాన్ మందిరంలో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడు సంవత్సరాల నుండి జగన్నాధ రథయాత్ర కావలిలో ఘనంగా జరిగిందన్నారు. పట్టణ పురవీధులలో ఈ యాత్ర ఎంతో ఉత్సాహంగా జరిగిందన్నారు. అదే విధంగా డిసెంబరు 16వ తేది మధ్యాహ్నం ఆర్ఎస్ఆర్ కళ్యాణమండపం నుండి ఈ రథయాత్ర ప్రారంభమవుతుందన్నారు. రథయాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామి కృపకు పాత్రులు కాగలరన్నారు. తీర్ధ ప్రసాదాలు స్వీకరించాలన్నారు. ఈ సమావేశంలో కావలి ఇస్కాన్ టెంపుల్ ప్రచారకర్త చంద్రశేఖర్‌స్వామి, డాక్టర్ మాధవరెడ్డి, నల్లూరి రవికుమార్, బొగ్గవరపు వెంకట సత్యనారాయణ(సత్య), వెంకట సుబ్బయ్య, రమేష్‌రెడ్డి, ముడిగండ్ల మాలకొండారెడ్డి, గోపీకృష్ణ, బచ్చు వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# రూ.103కోట్లతో రైల్వేస్టేషన్ ఆధునీకరణ



**నెల్లూరు నవంబర్ 17, ప్రభాతవార్త-వైద్యం** ప్రధాని నరేంద్రమోదీ, కేంద్రం ప్రభుత్వం ఇచ్చిన రూ.103కోట్లతో నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌ను ఎన్నో మౌళిక వసతులతో ఆధునీకరిస్తున్నట్లు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధ్రీశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్‌ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన తరువాత, రాష్ట్రమంతటా పర్యటన చేస్తూ కార్యకర్తలను కలవడం, పార్టీ సంస్థాగత నిర్మాణం మీద దృష్టి సారించడమే లక్ష్యంగా నా పర్యటనను ప్రారంభించానని ఆమె వెల్లడించారు. అందులో భాగంగా నేడు రైల్వేస్టేషన్‌ని పరిశీలించడం జరిగిందన్నారు. ఈ రైల్వేస్టేషన్‌కి వచ్చే ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు కల్పించాలనే ఆలోచనతో ఈ నిర్మాణాలను చేపట్టింది బీజేపీయేనని, ఇందులో వైసీపీ నామమాత్రపు పాత్ర కూడా లేదని పురంధ్రీశ్వరి చెప్పారు. ఇక్కడ ఉన్న 4 ఫ్లాట్‌ఫారమ్‌లని అనుసంధానించడమే కాకుండా, ఫ్లాట్‌ఫారమ్‌లతో సంబంధం లేకుండా ప్రయాణికులు ఏలాంటి ఇబ్బందులు లేకుండా నేరుగా వెలుపలికి వచ్చేందుకు అండర్‌గ్రౌండ్‌ల నిర్మాణం జరుగుతోందన్నారు. పాదచారుల బ్రిడ్జి నిర్మాణాలు పనులు కూడా చేస్తున్నారన్నారు. జాతీయ స్థాయిలో నెల్లూరు రైల్వేస్టేషన్‌ని బీజేపీ, కేంద్రం అత్యంత హంగులతో ముస్తాబు చేస్తోందని ఆమె వివరించారు.

ఈ నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేస్తామని ధీమా వ్యక్తంచేశారు. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉంటూ ఆంధ్రాపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, కేవలం అక్షరాలకే పరిమితం కాకుండా, అభివృద్ధిలో కూడా ఏపీ అగ్రగామిగా నిలబడాలనే సంకల్పంతో అన్నివిధాలా బీజేపీ, నరేంద్రమోదీ తమ వంతు కృషి చేస్తున్నాడని ప్రజలు తెలుసుకోవాలని, వైసీపీ నేతలు చెపుతున్న అబద్ధాలను తిప్పికొట్టాలని ఆమె పిలుపునిచ్చారు. నెల్లూరు నగరాన్ని అన్ని మౌళికవసతులతో తీర్చిదిద్దే దిశగా బీజేపీ తన వంతు సహకారాన్ని అందిస్తోందని ఆమె పేర్కొన్నారు. ఇప్పటికే రాయలసీమలో 7జిల్లాల్లో పర్యటన ముగిసిందని, కోస్తాలో గుంటూరు పూర్తి చేశానని, నేడు ఇక్కడకి రావడం జరిగిందన్నారు.

అయితే ఇప్పటి వరకు జరిగిన పర్యటనలో ఎక్కడ చూసినా, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అందించిన సహకారం ఆయా జిల్లాల అభివృద్ధి కోసం ఎలా సహకరించిందో ప్రధానంగా దృష్టి సారించానని పురంధ్రీశ్వరి తెలిపారు. బీజేపీ రాష్ట్రాభివృద్ధికి సహకరించదు అని అంటున్న వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు అంటున్నారని, ఆ మాటల్లో ఎంతమాత్రం నిజం లేదన్నారు. నరేంద్రమోదీ, కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులతోనే రాష్ట్రంలో ఏమూల అభివృద్ధి పనులు ఆ నిధులు బీజేపీ ఇచ్చినవేనని ఆమె ఉద్ఘాటించారు. బీజేపీ నిధులను విడుదల చేస్తున్నా కూడా, ఆ నిధులను ఈ వైసీపీ నేతలు దోచుకుంటూ, దారి మళ్ళిస్తూ కేంద్రం నిధులను ఇవ్వడంలేదని మోదీ, కేంద్రంపై దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. కావాలనే పనికట్టుకుని ఇలాంటి ప్రచారాలను వైసీపీ చేస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రతి జిల్లాలో కేంద్ర ప్రభుత్వం నిధులతో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను సందర్శించి, వాటిని ప్రజలకు తెలియచేయాలనే ఉద్ధేశ్యంతో ఈ పర్యటనను చేస్తున్నానని ఆమె తెలిపారు.

## 116 మందికి కాకర్ల చారిటబుల్ ట్రస్టు వైద్యసేవలు



**సీతారామపురం నవంబర్ 17 ప్రభాతవార్త** ఉదయగిరి నియోజకవర్గ టిడిపినాయకులు కాకర్ల సురేష్ ఏర్పాటు చేసిన కాకర్ల చారిటబుల్ ట్రస్టు ఆద్వర్యంలో నియోజకవర్గంలోని పేద ప్రజలకోసం ఎన్‌టిఆర్ సంజీవిని ఆరోగ్యరథం ద్వారా ఉచిత వైద్యసేవలు,ఉచిత మందుల పంపిణి చేస్తున్న విషయం విదితమే అందులో భాగంగా 178 వ రోజు అయిన శుక్రవారం సంజీవిని ఆరోగ్య రథం ద్వారా సీతారామపురం నారాయణమ్మపేట గ్రామం వద్ద ఆరోగ్య సమస్యలు వున్న గ్రామస్తులకు ఉచితంగా వైద్యపరీక్షలు చేయడంతోపాటుగా ఉచితంగా మందులు పంపిణితో కూడిన వైద్యసేవలు అందించడం జరిగింది. 116 మంది గ్రామస్తులకు డాక్టర్లు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వీరందరికి ఉచితంగా మందులు పంపిణి చేయడం జరిగింది. ట్రస్టు కో ఆర్డినేటర్ సభ్యులు సుమన్, ట్రస్టు సభ్యులు తిరుపతయ్య, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

## బిఎల్‌ఒలతో తహసిల్దారు సమావేశం



**సీతారామపురం నవంబర్ 17 ప్రభాతవార్త** స్దానిక తహసిల్దారు కార్యాలయం నందు శుక్రవారం మండలంలోని బిఎల్‌ఒలతో తహసిల్దారు ఎం.వికె సుధాకర్‌రావు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతు ఇప్పటికే ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైన నేపద్యంలో అందులో ఏమైనా ఓటర్ల మార్పులు చేర్పులు మరియు నూతన ఓటు హక్కు కొరకు ధరఖాస్తులు స్వీకరణ కొరకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. బిఎల్‌ఒలు వారి పరిధిలోని గ్రామాలలో ఉండి ధరఖాస్తులను స్వీకరించాలని అన్నారు. అదేవిధంగా నూతనంగా ఓటు హక్కు కోసం ధరఖాస్తు చేసుకునే వారు ధరఖాస్తు పారాలను బిఎల్‌ఒల వద్ద ఇవ్వాలని లేదా ఆన్‌లైన్‌లో గాని ధరఖాస్తు చేసుకోవచ్చునని అన్నారు. ఈ సమావేశంలో ఆర్‌ఐ శ్రీనివాసులు, ఎఎస్‌ఒ రాజేష్, రెవిన్యూఅధికారులు,పంచాయితీ కార్యదర్శులు బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

## చంద్రబాబు తోనే రాష్ట్రం అభివృద్ది చెందుతుంది



**దుత్తలూరు,నవంబర్ 17,ప్రభాతవార్త** : తెలుగుదేశం పార్టీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి నారాచంద్ర బాబు నాయుడు తోనే ఆంధ్రరాష్ట్రం అభివృద్ది చెందుతుందనీ మండల టిడిపి కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం అన్నారు.రాష్ట్రపార్టీ,ఉదయగిరి మాజీ శాసన సభ్యులు బొల్లినేని వెంకటరామారావు ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని తెడ్డుపాడు గ్రామంలో బాబు ష్యూరిటి-భవిష్యత్తు గ్యారెంటి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మండల కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో అభివృద్ది కుంటుపడిందనీ.రాష్ట్రంలో అన్ని వర్గాలకు సమన్యాయం జరగాలన్న,అభివృద్ది పథంలో ముందుకు పోవాలన్న అది చంద్రబాబునాయుడు తోనే సాధ్యం అవుతుందనీ,కాబట్టి రానున్న ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా,ఉదయగిరి ఎమ్మెల్యే గా బొల్లినేని వెంకటరామారావు లను గెలిపించుకొవాల్సి న భాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందన్నారు.అనంతరం ఇంటింటికి వెళ్ళి చంద్రబాబు గెలుపుతో ప్రజలకు అందనున్న సంక్షేమ పథకాలను వివరించారు.ఈ కార్యక్రమములో కొత్తపేట గ్రామ కమీటీ అధ్యక్షులు నాగేశ్వరరావు,కొత్తపేట ఐటిడిపి కోఆర్డినేటర్ వెంగళరావు,నేతలు పేలపూడి శ్రీనివాసులు,గుర్రం మహేంద్రబాబు,మాధవరావు,మాలకొండరాయుడు తదితరులు పాల్గొన్నారు.

## బీర పంట పరిశీలన



**వరికుంటపాడు,నవంబర్ 17,ప్రభాతవార్త** : మండలంలోని గొల్లపల్లి గ్రామ సమీపంలో సాగులో ఉన్న బీర పంటను ఉదయగిరి హార్టికల్చర్ అధికారిని ఓ.జయశ్రీ పరిశీలించారు.ఈ సందర్భంగా పంట సస్యరక్షణా చర్యలను రైతులకు సూచించారు.రైతు తగిన పద్దతులు పాటిస్తే అధిక దిగుబడిని పొందవచ్చని తెలి పారు. పంట ఎదుగుదలకు తీసుకొవాల్సి న చర్యలను రైతులకు వివరించారు.అనంతరం తూర్పు రొంపిదొడ్ల గ్రామంలో బత్తాయి మొక్కలను ఆమె పరిశీలించి,రైతులకు తగిన సలహాలు,సూచనలు అందజేశారు. ఈకార్యక్రమములో విఎఎ లు మిట్టా ఆదిత్య,శిరిషా,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కుపై కళాశాల విద్యార్థులకు అవగాహన



**వింజమూరు,నవంబర్17,ప్రభాతవార్త** :వింజమూరులోని శ్రీవివేకానంద డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఓటు హక్కుపై అవగాహనా సదస్సును నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅ తిథిగా తహసిల్దార్ చొప్పా రవీంద్రబాబు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును పొందాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధంగా పనిచేస్తుందన్నారు.ఓటు ద్వారానే స్వచ్ఛమైన ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టుకునే అవకాశం ఉందన్నారు.ఎన్నికల్లో నిజాయితీపరులైన ప్రజాప్రతినిధులను ఓటుద్వారా ఎన్నుకోగలమన్నారు. జిల్లా పాలనా అధికారి ఆదేశాల మేరకు వింజమూరు మండలంలోని పలు డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో ఓటు హక్కు ఆవశ్యకతపై అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్స్‌పాల్ జయంత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## బిజెపి సభకు తరలిన నియోజకవర్గ బిజెపి నేతలు



**వింజమూరు,నవంబర్17,ప్రభాతవార్త** : నెల్లూరులోని కస్తూరీభా గార్డెన్‌లో శుక్రవారం జరిగిన బిజెపి జిల్లా శక్తి కేంద్రాల ప్రముఖుల మరియుకమిటీ అధ్యక్షుల సమావేశానికి ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కదిరి వెంకటరంగారావ్ ఆధ్వర్యంలో ప్రతి మండలం నుండి పలు వాహనాల్లో నెల్లూరుకు తరలి వెళ్ళారు. ఈసందర్భంగా కదిరి రంగారావ్ మాట్లాడుతూ రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన దగ్గుపాటి పురంధరేశ్వరి తొలిసారిగా నెల్లూరుకు వచ్చిన సందర్భంగా జరిగే సమావేశాన్ని విజయవంతం చేసేందుకు నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున శక్తికేంద్రం ప్రముఖులు, బూత్‌కమిటీ అధ్యక్షులు, నియోజకవర్గ బిజెపి ముఖ్య నేతలు తరలి వెళ్ళారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు డేగా మధు, బిజెపి సీనియర్ నాయకులు గున్నం ప్రసాద్‌రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో కవిసమ్మేళనం



**వింజమూరు,నవంబర్17,ప్రభాతవార్త** : వింజమూరులోని గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రచయితల స ందేశాలు, కవిసమ్మేళనం లైబ్రేరియన్ జ్యోతి కొండయ్య ఆధ ్వర్యంలో నిర్వహించారు. నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుండెమడకల జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల తెలుగు ఉపాధ్యాయులు, సినీ గేయరచయిత కుంభగిరి రామయ్య హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరమని, విజ్ఞాన భాండాగారిగా విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. ఉత్తమ జ్ఞానాన్ని పొపందవచ్చన్నారు. ఎందరో మేధావులు గతంలో మైళ్ళ కొలది కాలినడకన వెళ్ళి గ్రంథాలయాల్లో కూర్చొని ఉదయం నుండి సాయంత్రం వరకు అక్కడే ఉండి వారికి అవసమైన విషయాలను తెలుసుకొని విజ్ఞానాన్ని పొందారన్నారు. గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలుగా నిలిచాయన్నారు. నేడు విద్యార్థులు గ్రంథాలయం విశిష్టతను , ప్రాముఖ్యతను తెలుసుకొని గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉదయగిరి నుండి టిడిపి అభ్యర్దిగా నేనే పోటీ చేస్తా



**కొండాపురం, నవంబరు 17 ప్రభాతవార్త** రాబోవు ఎన్నికలలో ఉదయగిరి నియోజవర్గం నుండి తెలుగుదేశం పార్టీ అభ్యర్దిగా నేనే పోటీ చేస్తానని అందులో ఎటువంటి అనుమానాలు వద్దని ఉదయగిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు తెలిపారు. శుక్రవారం కొండాపురంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల విస్తృత స్థాయి సమావేశంలో బొల్లినేని పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని పంచాయతీల నాయకులతో బూత్‌ల వారీ రివ్యూ చేయడం జరిగిందన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ...భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రజలకు వైసిపి చేస్తున్న అరాచకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల టిడిపి అధ్యక్షులు మామిళ్ళపల్లి ఓంకార్, జిల్లా అధికార ప్రతినిధి యారవ కిష్టయ్య, క్లస్టర్ ఇన్‌చార్జ్ చెరుకూరి వెంకటాద్రినాయుడు, పోలినేని రమేష్, చాగంటి కృష్ణ, నర్రా చెంచునాయుడు, గద్దె రాగయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కులగణనపై శిక్షణ ఇచ్చిన అధికారులు



**కావలి, నవంబరు 17 ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కులగణన 2023కు సంబంధించి కావలి డివిజన్ స్థాయిలో సిబ్బందికి శిక్షణా కార్యక్రమం జరిగింది. శుక్రవారం కావలి ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాధ్, జెడ్పీ సిఇవో చిరంజీవి, కావలి ఆర్డీవో శీనానాయక్‌లు పాల్గొని కులగణనపై అవగాహన కల్పించారు. ఈ నెల 21వ తేది నుండి డిసెంబరు 3వ తేది వరకు నిర్వహిస్తున్న కులగణన సర్వేలో సచివాలయాల పరిధిలో ప్రతి ఒక్కరిని నమోదు చేయాలని కులగణన జిల్లా నోడల్ అధికారి, జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాధ్ సిబ్బందిని ఆదేశించారు. ఎక్కడా విమర్శలు, సమస్యలు ఉత్పన్నం కాకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు.ఈ శిక్షణా కార్యక్రమంలో పూర్తి స్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలన్నారు. గతంలో నిర్వహించిన సర్వేలకంటే కుల సర్వే విభిన్నమైందన్నారు. నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలన్నారు.

## ఆకస్మికంగా సచివాలయాలను తనీఖీ చేసిన ఎంపిడిఓ



**ఉదయగిరి,నవంబర్ 17,ప్రభాతవార్త** : ఉదయగిరి మండలంలోని వెంగళరావునగర్ గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఓ డి.ఈశ్వరమ్మ ఆకస్మికంగా తనీఖీ చేశారు.సచివాలయంలోని పలు రికార్డులను పరిశీలించిన ఆమె సిబ్బంది కి తగిన సూచనలు ఇచ్చారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సహాయ ,సహాకారాలు అందించాలనీ తెలిపారు.సచివాలయ సిబ్బందితో పాటు వాలంటీర్లు కూడా వంద శాతం బయోమెట్రిక్ హాజరు కలిగివుండాలనీ తెలిపారు.ఉదయం10.30 నిమిషాల నుండి సాయంత్రం 5 గంటల వరకు బయోమెట్రిక్ హాజరూ కలిగిఉండాలనీ,ఫీల్డ్ విజిట్ బుక్ ను తప్పకుండా మెంయిటింగ్ చేయాలనీ తెలిపారు.నియమ నిబంధనలు పాటించనీ సిబ్బంది పై శాఖాపరమైన చర్యలు తప్పక ఉంటాయనీ హెచ్చరించారు.ఈ కార్యక్రమములో పంచాయతీ కార్యదర్శి హీనా,వెల్ఫేర్ అసిస్టెంట్ మమత తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర్లను సత్కరించిన ఉపకులపతి సుందరవల్లి



**కావలి రూరల్, నవంబరు 17 ప్రభాతవార్త** కావలి విక్రమ సింహపురి యూనివర్శిటీ కళాశాలలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ పి.వెంకటేశ్వర్లు పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో శుక్రవారం పి.వెంకటేశ్వర్లకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో విక్రమ సింహపురి యూనివర్శిటీ ఉపకులపతి ప్రొఫెసర్ జి.యం.సుందరవల్లి పాల్గొని వెంకటేశ్వర్లకు పూలబొకె అందజేసి దుశ్శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సత్కరించారు అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ కళాశాలలో వెంకటేశ్వర్లు గత 39 సంవత్సరాలుగా చేసిన సేవలను గుర్తు చేశారు. యూనివర్శిటీ రిజిస్ట్రార్ పి.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పనిచేసిన ప్రాముఖ్యతను గుర్తు చేసి పదవీ విరమణ అనంతరం వారి కుటుంబం సుఖసంతోషాలతో వుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.హెచ్.శ్రీనివాసరావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ సాయినాధ్‌రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ జి.సుజయ్‌కుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని జూనియర్ అసిస్టెంట్ పి.వెంకటేశ్వర్లు కళాశాల చేసిన సేవలను కొనియాడారు.

## ప్రముఖ కవులను స్మరించుకోవాలి



**కావలి రూరల్, నవంబరు 17 ప్రభాతవార్త** భారతదేశంలో కవుల యొక్క పాత్ర ఎంతో ముఖ్యమైనదని ప్రముఖ కవులను ఎల్లవేళలా స్మరించుకోవాలని తెలుగు అధ్యాపకురాలు శ్రీలక్ష్మి తెలిపారు. 56వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలను పురస్కరించుకొని కావలి వెంగళరావునగర్‌లోని ప్రభుత్వ శాఖ గ్రంధాలయంలో గ్రంధాలయాధికారిణి ఎస్.సునీత ఆధ్వర్యంలో శుక్రవారం కవి సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలుగు అధ్యాపకురాలు శ్రీలక్ష్మి ముఖ్యఅతిధిగా పాల్గొని భారతదేశంలో కవులకు వున్న ప్రాధాన్యత, ప్రత్యేకత, వారి గొప్పతనాన్ని గురించి విద్యార్థిని, విద్యార్థులకు తెలియజేశారు. ప్రతి ఒక్కరు గ్రంధాలయాలను సందర్శించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నలంద స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు మనీహర్, గ్రంధాలయ సిబ్బంది ఈశ్వరయ్య, పాఠకులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు



**కావలి, నవంబరు 17 ప్రభాతవార్త** కావలి రూరల్ మండలంలోని ఆనెమడుగు పంచాయతీలో మొండిదిన్నెపాలెంలో మైనర్ బాలిక వివాహాన్ని అధికారులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న అధికారులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ఆ గ్రామానికి వెళ్లారు. మైనర్ బాలిక తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, వివాహం జరిగితే జరిగే నష్టాలపై తెలియజేశారు. శనివారం వివాహం జరిపేందుకు సన్నాహాలు చేసుకున్న తరుణంలో అధికారులు అడ్డుపడ్డారు. దీంతో మైనర్ బాలిక తల్లిదండ్రులు మైనర్ తీరిన తర్వాత వివాహం చేస్తామని లిఖితపూర్వకమైన పత్రాన్ని తీసుకున్నారు. నెల్లూరు జిల్లా సిపిసిఎల్ కన్వీనర్ అబ్దుల్ అలీం, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు షేక్ ఖాదర్‌బీ, బ్రహ్మయ్య, కావలి అంగన్‌వాడీ ఎసిపివో శారద,సూపర్‌వైజర్ విజయలక్ష్మి, మొండిదిన్నెపాలెం సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## వెంగళరావునగర్‌లో గ్రామసభను నిర్వహించిన రెవిన్యూ అధికారులు



**ఉదయగిరి,నవంబర్ 17,ప్రభాతవార్త** : మండలంలోని వెంగళరావునగర్ గ్రామంలో తహశీల్దార్ సాన శ్రీనివాసులురెడ్డి గ్రామ సభను నిర్వహించారు.వెంగళరావునగర్ సచివాలయ పరిధిలో నిర్వహించిన ఈ సభకు గండిపాళెం నుండి ,వెంగళరావునగర్ నుండి ప్రజలు పాల్గోన్నారు.ఈ కార్యక్రమములో సాన శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూ సురక్ష పథకంలో భాగంగా అర్హులైన,భూమి లేని నిరుపేదలకు భూపంపిణీ జరుగుతుందనీ,అలాగే భూ రీసర్వేలో భాగంగా సాగుబడిలో ఉన్న భూమికి సంబందించిన వారికి శాశ్విత పట్టాలు పంపిణీ చేస్తామనీ తెలిపారు.గ్రామసభకు హాజరైన రెండూ గ్రామాల ప్రజలు తహశీల్ధార్ సాన శ్రీనివాసులురెడ్డికి భూ సమస్యల మీద వినతిపత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమములో వెంగళరావునగర్ సర్పంచ్ తిరుపతయ్య,విఆర్‌ఒ బిల్లుపాటి వెంకటేశ్వర్లు,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నెలరోజుల్లో డ్రైనేజీ పనులు పూర్తి చేస్తాం



**అనుమసముద్రంపేట,నవంబర్17,ప్రభాతవార్త** :మండల కేంద్రమైన ఏఎస్‌పేటలో డ్రైనేజీ కాలువ నిర్మాణాలను త్వరలో ప్రారంభించి నెలరోజులలోల్ల పూర్తిచేస్తామని ఆర్‌డబ్ల్యుఎస్ సూపర్నెంట్ ఇంజనీర్ ఎ.రంగప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన తన కింది స్థాయి అధికారులతో కలసి ఏఎస్‌పేట సర్పంచ్ భర్త జిలానీ బాషా, స్థానిక అధికారులతో కలసి ఆక్రమణలను తొలగించిన వీదులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశాల మేరకు డ్రైనేజీ నిర్మాణాన్ని పరిశీలించామన్నారు. ఎన్‌ఆర్‌ఇజిఎస్ ద్వారా మంజూరైన 60లక్షల రూపాయల నిధులను డ్రైనేజీకోసం ఉపయోగించనున్నట్లు తెలిపారు. ఎన్‌ఆర్‌ఇజిఎస్ నుంచి క్లియరెన్స్ వచ్చిందని పనులు ప్రారంభించేందుకు ఎలాంటి అడ్డంకులు లేవన్నారు. ఆక్రమణ తలొగించుకొని నెలలు గడుస్తున్నాఇంతవరకు ఉన్నతాధికారులు పటి ఇటంచుకోవడం లేదని వీధుల్లో మురుగునీరు పారుతోందని దర్గాకు వెళ్ళావారు మురికికాలువ ద్వారా వచ్చే నీరు తొక్కుకుంటూ వెళ్ళాలి ్స వస్తుందని స్థానికులకు అధికారుల దృష్టికి తెచ్చారు. స్పందించిన అధికారులు త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు, ఎఇ భవాని , సొసైటీ అధ్యక్షులు, కాంట్రాక్టర్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో నాగులచవితి



**బిట్రగుంట, నవంబరు 17 ప్రభాతవార్త** బోగోలు మండలంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో నాగులచవితి పర్వదినాన్ని నిర్వహించుకున్నారు. పలుచోట్ల నాగుల పుట్టల వద్ద మహిళలు బారులు తీరి వారి మొక్కుబడులను చెల్లించుకున్నారు. కొత్తూరులోని నాగవరప్పమ్మ దేవాలయంలో కూడా నాగులచవితిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఇందుకూరుపేటలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం



**ఇందుకూరుపేట, నవంబర్ 17, ప్రభాతవార్త** మండలంలోని ఇందుకూరుపేట 2/2 సచివాలయం పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో కొత్తూరు వైసీపీ నాయకులు కైలాసం శ్రీనివాసు లు రెడ్డి సమక్షంలో ఇంటింటికి తిరిగి.. గత ప్రభుత్వంలో హామీలు ఇస్తే అవి నెరవేరేవి కావని, ప్రజాభిప్రాయం సేకరించగా ప్రజలు టీడీపీ హయంలో ఒక్కటి కూడా చేయలేదని వారి హయాంలో హామీలు చెత్తబుట్టలకే పరిమితం అయ్యాయని విమర్శించారు. ఇప్పుడు హామీలు ఇస్తే పదికి పది హామీలు ఖచ్చితంగా నెరవేరుతున్నాయని ప్రజలు వారి అభిప్రాయం తెలుపుతున్నారని అన్నారు. తమ పంచాయతీ పరిధిలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు స్వప్న, ప్రేమలత, కమలమ్మ, గృహసారధులు, బొచ్చు మల్లి, సుధాకర్, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

## జలజీవన్ మిషన్ పనులు వేగవంతం కావాలి



**కోవూరు, నవంబరు 17 ప్రభాతవార్త :** ప్రజలకు సురక్షిత నీరు అందించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన జలజీవన్ మిషన్ పనులు మరింత వేగవంతం అయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగదీష్ పేర్కొన్నారు. కోవూరు మండలం ఇనమడుగు గ్రామ పంచాయతీలో ఈ పనులకు సంబంధించి పంచాయతీ కార్యదర్శి నాగరాజుతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పనులకు నిధుల కొరత లేదని, పనులు చేపట్టిన వారు ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలకు లోబడి పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, తదితరులు ఉన్నారు.

## గృహ నిర్మాణాలు మరింత వేగవంతం కావాలి



**కోవూరు, నవంబరు 17 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మం డలాల్లో జగనన్న కాలనీల్లో జరుగుతున్న గృహ నిర్మాణ పనులు మరింత వేగవంతం అయ్యేలా ఆయా మండలాల ఏఈలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ డీఈ దయాకర్ అన్నారు. కోవూరులోని గృహ నిర్మాణశాఖ డీఈ కార్యాలయంలో శుక్రవారం ఆయన నియోజకవరగ పరిధిలోని గృహ నిర్మాణ శాఖ ఏఈలతో నిర్మాణ పనులపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపట్టే నిర్మాణ పనులు ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలకు లోబడి సాగాలన్నారు. లబ్దిదారులు కూడా ప్రభుత్వం ఇచ్చిన ఇటువంటి మంచి అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కూడా వారికి కేటాయించిన జగనన్న కాలనీల్లో గృహాల లబ్దిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా దృష్టి పెట్టాలన్నారు. అనంతరం మండలాల వారీగా నిర్మాణాల ప్రగతిపై సమీక్షించారు. ఈ సమీక్షలో గృహ నిర్మాణ శాఖ ఏఈలు మాధవయ్య, వెంకటేశ్వర్లురెడ్డి, పెంచలయ్య, తదితరులు ఉన్నారు.

## ఆలిండియా సౌత్ జోన్ ఎంపికలో గీతాంజలి విద్యార్థుల విజయకేతనం



**కోవూరు, నవంబరు 17 ప్రభాతవార్త :** ఆలిండియా సౌత్ జోన్ ఎంపికల్లో తమ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి విజయదుందుభిని మోగించి తమ కళాశాల పేరు ప్రతిష్టలను మరింత ఇనుమ డింపజేశారని కళాశాల కార్యదర్శి ఎన్. సుధాకర్‌రెడ్డి తెలిపారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె సందీప్‌కుమార్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా రాజంపేట, అన్నమాచార్య డీండ్ విశ్వవిద్యాలయంలో జరిగిన అఖిలభారత బాల్ బ్యాడ్మింటన్ క్రీడలో తమ విద్యార్థులు ఎం. పూర్ణ అశోక్, సీహెచ్ అశ్వినిలు అత్యంత ప్రతిభ కనబరిచారన్నారు. అదేవిధంగా తిరుపతి శ్రీ రామ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన సౌత్ జోన్ కబడ్డీ పోటీలో తమ కళాశాల విద్యార్థులు టి. పూర్ణచందు, వి. సునీల్, జేఎన్‌టీయూ కలికిరిలో నిర్వహించిన హాకీ సౌత్ జోన్ పోటీలో కె. శ్రీహితేష్, ఆలిండియా పెన్‌కాక్ సిలాన్ పోటీలో కె. జర్మియా శోభిత్, ఏవీ సాత్విక్, ఆలిండియా ఫెన్సింగ్‌లో బి. సంతోష్ కుమార్, సౌత్ జోన్ చెస్ పోటీలో బి, రాఘవర్షిణి ఎంపికై తమ కళాశాల పేరు ప్రతిష్టలను మరింత ఇనుమడింపజేశారన్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఈ పోటీలన్నీ జేఎన్‌టీయూ అనంతపూర్ పరిధిలో 2023-24 సంవత్సరానికి నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి. సుబ్బారావు, సంయుకనత కార్యదర్శి పి. శ్రీనివాసులురెడ్డి, కోశాధికారి వై. విజయశంకర్‌రెడ్డి, క్రీడా సమన్వయకర్త పి. ఉమసాయి, సహాయ ఫిజికల్ డైరెక్టర్ వి. హరిప్రసాద్, తదితరులు ఉన్నారు.

## సచివాలయం పరిశీలన



**సైదాపురం, నవంబర్ 17, ప్రభాతవార్త** మండల పరిధిలోని రామసాగరం గ్రామంలో ఉన్న సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని మండల వ్యవసాయాధికారిణి హైమావతి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హాజరు పట్టికలను తనిఖీ చేశారు. ప్రభుత్వం రైతుల కొరకు అందిస్తున్న సంక్షేమ పథకాలకు రైతులకు అందాలంటే ప్రతి ఒక్కరూ ఈ పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి నరేంద్ర, వ్యవసాయ సహాయకులు సుబ్బారావు, సచివాలయ సిబ్బంది ఉషారాణి, ఆదిలక్ష్మి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇకనైనా బీఎల్‌వోలు అలసత్వం వదలాలి



**కోవూరు, నవంబరు 17 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బీఎల్‌వోలు వారికి కేటాయించిన విధులు, బాధ్యతల విషయంలో అలసత్వం ప్రదర్శించకుండా బాధ్యతగా విధులు నిర్వహించాలని తహసీల్దార్ ఎం. పద్మజ అన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయంలో శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం నియోజకవరనగ పరిధిలో 11 వేలు ఫారం-6, 7, 8 కు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ దరఖాస్తులను నిశితంగా పరిశీలించి సకాలంలో వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఇంకా పలు కేంద్రాల్లో మృతులకు సంబంధించిన వారు ఓటర్ల లిస్ట్‌లో ఉన్నారని, ఒకటికి రెండు సార్లు ఆ వివరాలు నిశితంగా పరిశీలించాలన్నారు. అదేవిధంగా ఓటరుకు సంబంధించిన ఫొటోల విషయంలో కూడా పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడా కూడా డబుల్ ఎంట్రీ లేకుండా చూడాలన్నారు. ఈ సమీక్షలో డిప్యూటీ తహసీల్దార్ ఇలియాజ్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమణయ్య, సీనియర్ అసిస్టెంట్ సుధా, బీఎల్‌వోలు ఉన్నారు.

## ఘనంగా నాగుల చవితి



**కోవూరు, నవంబరు 17 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం నాగుల చవితి వేడుకలు సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళా భక్తులు వేకువజామునే నాగుల పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో ఈ నాగుల చవితి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వాహకులు చేపట్టారు. కోవూరు మండలం చిన్నపడుగుపాడు ప్రాంతంలో వెలసి ఉన్న నాగులపుట్ట వద్ద భారీస్థాయిలో పూలంగి సేవ కార్యక్రమాన్ని కన్నులపండువగా నిర్వహించారు. అదేవిధంగా స్థానిక పెళ్లకూరు కాలనీలోని నాగులపుట్ట వద్ద వేకువజామునే మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అన్ని ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్ ఆధ్వర్యంలో బందోబస్తు కూడా ఏర్పాటు చేశారు.

## ఘనంగా సిద్ధమాలకు పూజలు



**కోవూరు, నవంబరు 17 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీపార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో కార్తీకమాసంలో వచ్చే ప్రథమ శుక్రవారం పర్వదినం సందర్భంగా ప్రాత:కాలమునే నర్మద నది నుంచి సేకరించిన 11 వేల నర్మద బాల లింగాలకు సుగంధ ద్రవ్యాలతో ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకముఖి నుంచి 14 ముఖముల గల రుద్రాక్షలతో కూర్చి న సిద్ధమాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బి. సురేష్, ధర్మకర్తలు పి. మోహన్, హనుమారెడ్డి, నాగరాజు, పెద్ద సంఖ్యలో భక్తులు ఉన్నారు.

## భారీస్థాయిలో అన్నదానం



**కోవూరు, నవంబరు 17 ప్రభాతవార్త :** కోవూరు మండలం చిన్నపడుగుపాడు ప్రాంతంలోని నాగులపుట్ట వద్ద శుక్రవారం నాగులచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రామిరెడ్డి దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీస్థాయిలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని పడుగుపాడు సొసైటీ చైర్మన్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దయాకర్‌రెడ్డి గత సంవత్సరాలుగా నిర్విరామంగా ఈ అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారని,ఇందుకు ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. ఈ అన్నదాన కార్యక్రమానికి చుట్టుపక్కల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎస్. నరసింహులురెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రాజగోపాల్, మాజీ ఎంపీటీసీ సభ్యులు సూర్యనారాయణ, తదితరులు ఉన్నారు.

## ఘనంగా కార్తీక శుక్రవారం పూజలు



**కోవూరు, నవంబరు 17 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ పార్వతి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో కార్తీక మాసంలో వచ్చే శుక్రవారం సందర్భంగా ఆలయంలో స్వామి వారికి, అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు కార్తీక పూజలు నిర్వహించారు.ఆలయ చైర్మన్ బి. సురేష్, ధర్మకర్తలు పి. మోహన్, ఏ. హనుమారెడ్డి, భక్తులు ఉన్నారు.

## భక్తి శ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు



**కలువాయి నవంబర్ 17 ప్రభాతవార్త** నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తెల్లవారు జామునుండి స్నానాలు ఆలయాలలో స్నానాలు ఆచరించి ఉపవాసాలు ఉండి నాగుల పుట్టల వద్ద మొక్కుబడులు చెల్లించుకుంటు విశేషంగా పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా స్ధానిక షిరిడి సాయిబాబా ఆలయనందు ఉండే నాగుల పుట్టయందు,అదే విధంగా శ్రీకలువాయమ్మ దేవస్ధానానికి అనుసందానమైన స్ధానిక పోలీస్‌స్టేషన్‌లో ఉండే నాగల బండ యందు వీటితోమండలంలో అనేక ప్రాంతాలలో ఉండే సుబ్రమణ్యంస్వామి పుట్టలయందు ప్రతి ఏడాది లాగే మహిళలు పూజలు నిర్వహించారు.

## భక్తి శ్రద్ధలతో నాగులచవితి



**సైదాపురం, నవంబర్ 17, ప్రభాతవార్త** సైదాపురం మండలంలోని పలు గ్రామాల్లో నాగులచవితి పండుగను పురష్కరించుకుని భక్తిశ్రద్ధలతో భక్తులు పుట్టలో పాలు పోసి సుబ్బరాయుడా మమ్మల్ని కరుణించమని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలు చేసిన భక్తులు స్వామివారి ప్రసాదాన్ని పలువురికి పంచారు.

## పురంధ్రీశ్వరికి ఖడ్గాన్ని బహుకరించిన ఓబీసీ మోర్చా ఫణిరాజు



**నెల్లూరు నవంబర్ 17, ప్రభాతవార్త-వైద్యం** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి నగరంలోని కస్తూరిగార్డెన్స్ లో జరిగిన శక్తి కేంద్ర ప్రముఖ్, బూత్ కమిటీల అధ్యక్షుల సమావేశానికి విచ్చేసిన ఆమెకు ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యాకసిరి ఫణిరాజు గజమాల వేసి, వీరఖడ్గాన్ని అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఫణిరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో సాగుతున్న రాక్షస పాలనకు ధీటుగా ముందుకు సాగుతున్న తరుణంలో పురంధ్రీశ్వరి రాష్ట్రంలో అవినీతిపరుల అక్రమాలను, ఆమె వేస్తున్న కత్తి కంటే పదునైన ప్రశ్నల తీరుకు ప్రతీకగా ఆమెకు ప్రత్యేక పూజలు చేసిన వీరఖడ్గాన్ని అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొగరాల సురేష్, యర్రబోలు రాజేష్, కుడుముల గిరికుమార్‌గౌడ్, కోసూరు సుధీర్, లింగాల రామకృష్ణ, నీలకంఠ ప్రసాద్, బృంది మల్లేశ్వరరావు, గుంజి కృష్ణ, రాపూరు ప్రసాద్, మహిమలూరు శ్రీనివాసులు, కీలుకుప్ప శ్రీనివాసులు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల అడుగుజాడల్లో పయనించాలి

**కోవూరు, నవంబరు17 ప్రభాతవార్త :** విద్యార్థులు ప్రాథమిక దశ నుంచి గ్రంథాలయాల్లో పుస్తక పఠనం చేయడం ద్వారా వారి మేదస్సు మరింత పదును పడుతుందని కోవూరు లైబ్రేరియన్ జె. సురేంద్రరెడి పేర్కొన్నారు. కోవూరులోని శాఖా గ్రంథాలయంలో శుక్రవారం56వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మహనీయులు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరగంథాలయాల్లో మహనీయులకు సంబంధించిన అనేక చరిత్ర పుస్తకాలు ఉన్నాయని, విద్యార్థులు వాటిని పూర్తిస్థాయిలో ఆకళింపు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ లైబ్రేరియన్డ్, కె. శంకరయ్య్‌ను లైబ్రేరి యన్ జె. సురేంద్రరెడ్డి శాలువా సత్కరించారు. ఈ కార్యక్రమంలో , ఉపాధ్యాయులు రంగారెడ్డి, , సత్యనా రాయణ మూర్తి, తదితరులు ఉన్నారు. తదితరులు ఉన్నారు.

## కోటి మంది ఎస్సిలకు న్యాయం చేయండి



పొదలకూరు నవంబర్ 17 ప్రభాతవార్త ఆంధ్రప్రదేశ్‌లో కోటి మంది ఎస్సిలు వైసిపికు ఓటు వేశారని వారికి న్యాయం జరగడం లేదని రానున్న అసెంబ్లీ సమావేశాలలో ఎస్సిల సమస్యలపై శాసనసభలో మాట్లాడాలని డిమాండ్ చేస్తున్నామని బిజెపి ఎస్‌సి మోర్చ సర్వేపల్లి విభాగం అద్యక్షులు మాముదూరు రవీంద్రబాబు రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కాకాణి గోవర్దన్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ మేరకు మంత్రి నివాసం వద్ద బిజెపి ఎస్‌సి మోర్చ విభాగం వారు బిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించారు. బిజెపి రాష్ట్ర అద్యక్షులు దగ్గుబాటి పురందరేశ్వరి ఆదేశాలకు అణుగుణంగా ఎస్‌సి మోర్చ రాష్ట్ర అద్యక్షులు గుడిసే దేవానంద్ ఆద్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్‌సి కార్పోరేషన్‌ల ఎదుట నిరసనలు ధర్నాలు ,నిరాహార దీక్షలు చేసిన ఇప్పటికి ప్రభుత్వంలో చలనం లేదని ప్రజాస్వామ్య పద్దతిలో ఆందోళన కొనసాగిస్తున్నపట్టికి ప్రభుత్వ తీరులో మార్పులేదని ఆయన ప్రభుత్వాన్ని విమర్శించారు.గతంలో ఎస్‌సి కార్పోరేషన్‌ల ద్వారా అమలు జరుగుతున్న 26 రకాల పధకాలను రద్దు చేసిన ప్రభుత్వం తిరిగి ప్రారంభించడం కోసం బిజెపి రాష్ట్రా స్దాయిలో పెద్దఎత్తున నిరసనలు తెలిపిందని ధర్నాలు చేశామని నిరాహారదీక్షలు చేపట్టామని అయినా ప్రభుత్వం అశ్రద్ద చేస్తుందని ఎస్సిల ఆర్దిక మూలాలను దెబ్బతీయడం అన్యాయమని అదే విధంగా గడిచిన నాలుగున్నార సంవత్సరాల కాలంలో 7 వందలకు 50కిపైగా ఎస్సిలపైన దాడులు హత్యలు మానభంగాలు ఆత్మహత్యలకు ప్రేరేపించే సంఘటనలపై గౌరవ హైకోర్టు సిట్టింగ్ జర్జి ఆద్వర్యంలో విచారణ జరిపించాలని ఏపి ఎస్‌సి మోర్చ డిమాండ్ చేస్తుందని ఈ మేరకే గౌరవ శాసనసభ్యుల ఇంటి ముందు రాష్ట్ర వ్యాప్తంగా బిక్షాటన కార్యక్రమం చేస్తున్నామని వివరించారు. ఎస్‌సి మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు సర్వేపల్లి ఇన్‌చార్జి మామూదురు రవీంద్రతోపాటు ఎస్‌సి మోర్చ వివిధ విభాగల నాయకులు పాల్గోన్నారు.

## మాదకద్రవ్యాలతో చెడు మార్గంలో యువత



**ఇందుకూరుపేట, నవంబర్ 17, ప్రభాతవార్త** ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మాదక ద్రవ్యాల వినియోగం అనే అంశంపై యువతకు అవగాహన కలిగేలా తెలుసుకుని జాగ్రత్తగా ఉండాలని తెలియజేశారు. ప్రధానంగా గ్రామంలో యువత చెడు మార్గంలో తమ ప్రాణాలకు ముప్పు తెచ్చుకుంటున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ బాలకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం మైపాడుపాలెంలో మాదక ద్రవ్యాల ప్రమాదంపై అవగాహన కార్యక్రమం నిర్వహించి వారిచే ఎటువంటి తప్పులు తాము చేయమని చేసే వారిని క్షమించమని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ఫలితాలు వివరించారు. మాదక ద్రవ్యాలు కలిగి ఉన్నా, రవాణా, అమ్మినా, కొనిన అటువంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, మాదక ద్రవ్యాల సమాచారం గురించి గవర్నమెంట్ టోల్ ఫ్రీ నెంబరు 14500కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఇటీవల కాలంలో భవిష్యత్తులో ఉన్నత స్థితికి ఎదగాల్సిన యువత చెడు స్నేహాల కారణంగా మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారి తమ ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై యువత అవగాహన ద్వారా యువతలో చైతన్యం తీసుకురావాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. మాదక ద్రవ్యాల భారిన పడి నష్టపోయిన ఉదంతాలను గణాంకాలతో వివరించారు. యువత ఉన్నతంగా చదివి సంస్కారవంతులుగా ఎదిగి ఉన్నతస్థితికి వచ్చి తమకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల కీర్తి ప్రతిష్ఠలు కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, గ్రామస్తులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రూరల్‌లో మరమ్మత్తులతో విద్యుత్ నిలిపివేత

**నెల్లూరు నవంబర్ 17, ప్రభాతవార్త-వైద్యం** డిఎస్ఆర్ సబ్‌స్టేషన్ పరిధిలో కెవి ఫీడర్‌లోని లేక్‌వ్యూకాలనీ, ప్రగతినగర్, ఏ, బి బ్లాక్‌ల ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచ మధ్యాహ్నం 1 గంట 30 నిమిషాల వరకు, ఆలోనగర్ సబ్‌స్టేషన్ పరిదిలో ఉడ్ కాంప్లెక్స్ ఫీడర్ ప్రాంతంలో విక్రమ్‌నగర్, డ్రైవర్స్‌కాలనీల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు చెట్ల కొమ్మలు తొలగించేందుకు శనివారం విద్యుత్‌ను నిలిపి వేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఏ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రజల సంక్షేమం కోసం శ్రమిస్తున్న జగనన్నను మళ్లీ సియం చేయాలి



**కావలి, నవంబరు 17 ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అహర్నిశలు పాటుపడుతున్నారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రానున్న ఎన్నికలలో జగనన్నను సియంగా మళ్లీ గద్దెనెక్కించాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కావలి మున్సిపాల్టీ పరిధిలోని 12వ వార్డులో ఎమ్మెల్యే పర్యటించారు. వైసిపి ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్లను ప్రతి ఇంటికి తిరిగి అందజేశారు. అవగాహన కల్పించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, మురికి కాలువలు లేక ఇబ్బందులు పడుతు న్నామని ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. త్వరలో ఈ సమస్యల్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజలు మంచి ఆదరణ చూపిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల ఫలాలు అందుతున్నాయని లబ్దిదారులు చెప్పడం ఎంతో సంతోషంగా వుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మోసపు మాటలు చెప్పారన్నారు. మన ముఖ్యమంత్రి జగనన్న ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాల ఫలాలను అర్హులందరికి అందజేసి ప్రశంసలందుకుంటున్నారన్నారు. 99 శాతం హామీలను నెరవేర్చారన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పెట్టుకొని జగనన్న పనిచేస్తున్నారన్నారు. ఈ వార్డులో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. మహిళలు హారతులు ఇచ్చి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కావలి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, వార్డు ఇన్‌చార్జులు చేవూరు కిరణ్‌కుమార్, దావులూరి శ్యామ్‌సన్, అక్కిలిగుంట మాల్యాద్రి, వైసిపి పట్టణ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, వైసిపి నేతలు అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, కనమర్లపూడి వెంకట నారాయణ, గంధం ప్రసన్నాంజనేయులు, పందిటి కామరాజు, మండలి కృష్ణారావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## పిల్లల్లో మేధాశక్తిని పెంపొందించాలి



**నెల్లూరు, నవంబర్ 17, ప్రభాతవార్త- విద్య** నవంబర్ 14వ తేదీ నుండి నవంబర్ 25వ తేదీ వరకు జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నెల్లూరు నగరంలోని రంగనాయకులపేటలో ఉన్నటువంటి గ్రంథాలయ శాఖను నగర ప్రముఖ డాక్టర్ పీర్ అహ్మద్, జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి కుమార్‌రాజా సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ శాఖ అధికారిణి అరుణకు పిల్లల్లో మేధాశక్తిని పెంపొందించేందుకు సూచనలు, సలహాలు అందించారు. అదే విధంగా ఈ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయానికి వచ్చే విద్యార్థులకు అందరికి కూడా తగిన సలహాలు సూచనలతో పాటు వాళ్ళ మేధాశక్తిని పెంపొందించినందుకు చక్కని ఆటలను కూడా ఆడించి తద్వారా వారికి విజ్ఞానాన్ని పెంపొందించాలని తెలిపారు.

## రాపూరులో అయ్యప్ప,గోవింద స్వాములకు నాల్గవ రోజు అన్నదానాం

**రాపూరు, నవంబరు17ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరులోని శ్రీశ్రీశ్రీ మహావిష్ణువు, శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి వారి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా నిర్వహిస్తున్న మండల కాల(41 రోజులు) అన్నదానం కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తునహజరైతున్నారు. అన్నదాన కార్యక్రమంలో నాలుగో రోజైన శుక్రవారం ఉదయం స్వామి వారి ఆలయంలో శ్రీగణపతి హోమం నిర్వహించి పలువురు స్వాములు పవిత్ర ఇరుముడి కట్టుకుని శభరిమలై భయలు దేరారు. మధ్యాహ్నం అయ్యప్ప స్వాములకు,గోవింద స్వాములకు, స్వామి వారి భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం శ్రీమహావిష్ణువు ధ్వజస్థంబం వద్ద అకాశ దీపం వెలిగించిన అనంతరం స్వామి వార్లకు ప్రత్యేక పూజలు,భజనలు నిర్వహించారు. తదుపరి మాలాధారణ చేసుకున్న స్వాములకు రాత్రి బిక్ష కార్యక్రమం నిర్వహించారు. మద్యాహ్నంబిక్ష కార్యక్రమానికి దాతలుగా రాపూరు లక్ష్మీపురంకు చెందిన షేక్ సిలార్, జోరేపల్లి అక్కమాంబాపురంకు చెందిన వై అమ్ములు వ్యవహరించగా రాత్రి బిక్షకు సిద్దవరం గ్రామానికి చెందిన తంబిశెట్టి శ్రీనివాసుల కుటుంభసభ్యులు వ్యవహరించారు. పెద్ద ఎత్తున స్వాములు, ఆలయ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## భక్తి శ్రద్దలతో నాగులచవితి వేడుకలు



రాపూరు, నవంబరు17ప్రభతవార్త నాగులచవితి పర్వదిన వేడుకలు శుక్రవారం రాపూరు మండలంలో భక్తులు భక్తి శ్రద్దలతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఉదయాన్నే తలస్నానాలు చేసి ఇంటిలో పూజలు నిర్వహించుకొని నాగదేవతలకుఇష్టమైన నువ్వులు చిలుముడి, పాలు, గుడ్లు తీసుకోని పోలాల్లో వున్న నాగుల పుట్ట వద్దకు చేరుకోని పుట్టకు దారంకట్టి పసుపు, కుంకుమలు పూసి, నాగుల పుట్టలో పాలు, గుడ్లువేసి తమను, తమ కుటుంబాలను చల్లగా చూడాలం టూ నాగదేవతకు మొక్కులు చెల్లించుకున్నారు.

## కవిసమ్మేళనంపై విద్యార్థులకు అవగాహన



**రాపూరు, నవంబరు17ప్రభాతవార్త** జాతియ గ్రంథాలయ వారోత్సవాలలో బాగంగా శుక్రవారం విద్యార్ధులకు కవిసమ్మేళనంపై అవగాహన నిర్వహించారు. ఇందులో బాగంగా గురుజాడ అప్పారావు, గుర్రం జాషువా, కందుకూరి విరేశలింగం పంతులు, నన్నయ, తిక్కన, ఎర్ర ప్రగడ వంటి గొప్ప గొప్ప కవుల గురించి, వారి జీవిత చరిత్రలను వారు రచించిన గ్రంథాలు, వారు సమాజానికిఇచ్చిన మంచి సందేశాలను చదివి గ్రంథాలయ అధికారి జె.ధనమ్మ విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గుడ్‌షపర్డ్ ఇంగ్లీషు మీడియం పాఠశాల సైన్స్ ఉపాధ్యాయురాలు ఎస్‌డీ ఆరీఫా, గ్రంథాలయ సహాయకుడు వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

## శ్రీధర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరికలు



**నెల్లూరు నవంబర్ 17, ప్రభాతవార్త-వైద్యం** రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిల ఆధ్వర్యంలో 12, 23వ డివిజనులకు చెందిన 50కుటుంబాలు శుక్రవారం రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో వారి సమక్షంలో టీడీపీలో చేరారు. వారిని పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ కష్టకాలంలో ఎంతోమంది ముందుకు వచ్చి టీడీపీలో చేరడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు, నాకు అండగా ఉన్న ప్రతిఒక్కరికి భవిష్యత్తులో నేను అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జన్ని రమణయ్య, జిల్లా అధికార ప్రతినిధి పఠాన్ సాబీర్‌ఖాన్, కనపర్తి గంగాధర్, బద్దెపూడి నరసింహగిరి, మేకల మధు, నెల్లిపూడి సుధాకర్, నన్నం శ్రీనివాసులు, సికారి భాస్కర్, చిన్న మల్లిఖార్జున, బాపూజీ, చిన్నారావు, ప్రసాద్, పూజారి శేషయ్య, మస్తానయ్య, కస్తూరయ్య, తిరుపాలయ్య, బాలాజీ, ఈశ్వరయ్య, వెంకటేశ్వర్లు, మోహన్, కిష్టయ్య, సంపూర్ణ, ముత్యాలమ్మ, ఆదిలక్ష్మమ్మ, వెంకటమ్మ, అన్నపూర్ణమ్మ, మస్తానమ్మ, కావేరి, లక్ష్మి, కోటమ్మ, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పోలేరమ్మ పోతురాజు సహిత విగ్రహప్రతిష్ట మహోత్సవం



**సీతారామపురం నవంబర్ 17 ప్రభాతవార్త** సీతారామపురం మండలంలోని పోకలవారిపల్లి గ్రామం నందు నూతనంగా నిర్మించిన సహిత పోతురాజు నూతన విగ్రహప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాలలో భాగంగా రెండవరోజు అయిన శుక్రవారం ఉదయం విగ్రహాల గ్రామోత్సవం గణపతి విగ్రహ చండి అవివాహిత హోమం రుద్రాభిషేకాలు, సాయి ంత్రల లలిలా సహస్రనామార్చనలు, శాంతి పోషక హోమం మంగళహారతులు ఇచ్చి తీర్ద ప్రసాదాలు పంపిణి చేశారు. అమ్మవారు పురవీదులలో గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అదిక సంఖ్యలో పూజలో పాల్గోన్నారు. ఈనెల 20 వ తేది వరకు వివిధ ప్రత్యేకపూజలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని మండలంలోని ప్రతి ఒక్కరు అమ్మవారిని దర్శించుకోవాలని గ్రామ ఉత్సవ కమీటి సభ్యులు కోరారు.

## గునుకుల మద్దతు కోరిన పొంగూరు రమాదేవి



**నెల్లూరు, నవంబరు17 ప్రభాతవార్త-విద్య** జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, వారి కుటుంబసభ్యులను గునుకుల నివాసంలో శుక్రవారం సాయంత్రం తెలుగుదేశం పార్టీ నగర ఇన్‌చార్జ్ పొంగూరు నారాయన సతీమణి పొంగూరు రమాదేవి మరా ్యదపూర్వకంగా కలసుకున్నారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతు రానున్న ఎన్నికల్లో జనసేన, తెలుగుదేశం ల సంయుక్త ఆధ్వర్యంలో గెలుపే లక్ష్యంగా పనిచేయ్యాలని కోరారు. అలాగే ప్రజా ప్రభుత్వం ఏర్పాటుచేసేందుకు శక్తి వంచన లేకుండా కృషిచేయ్యాలని కోరారు. గునుకుల కిషోర్, ఆయన సతీమణి మాట్లాడుతు తమ అధినేత పవన్‌కళ్యాణ్ నిర్ణయానికి కట్టుబడి ఉంటామన్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీల కలయికను ప్రజలు స్వాగిస్తున్నారన్ని, రాష్ట్రంలో వైకాపా నాయకులు రాక్షస పాలన సాగిస్తునా ్నరని ధ్వజమెత్తారు. అభివృద్ధి లేకుండా అందిన కాడికి అప్పులు చేసి, అవసరంలేని సంక్షేమాన్ని చూస్తూ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి దివాలా తీయించారన్నారు. దీనిని నివారించి రాష్ట్రాని అభివృద్ధి మార్గంలో నడిపేందుకు ఇరుపార్టీల గెలుపు అనివార్యమన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కష్టపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన వీరమహిళలు, తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ మాకొద్దని ప్రజలే అంటున్నారు



**నెల్లూరు నవంబర్ 17, ప్రభాతవార్త-వైద్యం** ఈ వైసీపీ ప్రభుత్వం మాకొద్దని ప్రజలే అంటున్నారని తెలుగుదేశం పార్టీ మాజీమంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని 44, 46వ డివిజన్లలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో నారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో మేము చేసిన అభివృద్ధిని స్థానికులు ఇంకా గుర్తు పెట్టుకుని ఉండడం ఎంతో సంతోషాన్నిస్తుందన్నారు. టీడీపీ మరలా అధికారంలోకి రావాలని అందరూ కోరుకుంటున్నారని ఆయన తెలిపారు. దోమలు లేని నగరంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పొంగూరు అన్నారు. వైసీపీ నేతలు ఏమి మాట్లాడుతున్నారో వారికే అర్ధం కాని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. 2024లో వైసీపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పడం తధ్యమన్నారు. డివిజన్‌లో ఏ గడపకు వెళ్ళినా టీడీపీకే ఓటు వేస్తామని చెప్పడం సంతోషంగా ఉందన్నారు. నువ్వు మంత్రివైతే నేను పది నియోజకవర్గాలకి నుడా చైర్మన్‌గా చేశానని గుర్తుంచుకోవాలని అనిల్‌కుమార్ యాదవ్‌ని ఉద్దేశించి శ్రీనివాసులురెడ్డి అన్నారు. నీకు దమ్ముంటే రా నీ అవినీతిపై, నగరాభివృద్ధిపై చర్చకు సిద్ధం అంటూ అనిల్‌కి సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో ముప్పాళ్ళ విజేతరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కువ్వారపు బాలాజీ, పిట్టి సత్యనాగేశ్వరరావు, తాళ్ళపాక అనూరాధ, మహేంద్రరెడ్డి అలియాస్ చిన్నబ్బయ్య, ఏడుకొండలు, కరిముల్లా, దర్శి హరికృష్ణ, బ్రహ్మం, మక్కిన రమేష్, నన్నేసాహెబ్, కోకు మహిదర్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, మునికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాలకులు చేతులెత్తేశారు...అధికారులారా ప్రజల సమస్యలు పట్టించుకోండి



**కావలి, నవంబరు 17 ప్రభాతవార్త** కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అభివృద్దిని గాలికొదిలేశారని, ప్రజలు ఆయనపై తీవ్ర వ్యతిరేకతతో వున్నారని, అధికారులైనా ప్రజల సమస్యలను పట్టించుకోవాలని టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు తెలిపారు. కావలి మున్సిపాల్టీ పరిధిలోని 2వ వార్డులో మాలేపాటి నాయకత్వంలో శుక్రవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాలేపాటి, టిడిపి నేతలు ఇంటింటికి తిరిగి టిడిపి మినీ మేనిఫెస్టో కరపత్రాలను అందజేశారు. టిడిపి పథకాలపై అవగాహన కల్పించారు. బాండు రూపంలో బాబు ష్యూరిటీ..భవిష్యత్‌కు గ్యారెంటీ కార్డులు అందజేశారు. అనంతరం మాలేపాటి మాట్లాడారు. తెలుగుదేశం పాలనలో అభివృద్ధి పనులు ఎలా జరిగాయో అందరికి తెలుసునన్నారు. ఈ రోజు కనీసం రోడ్లపై తట్టెడు మట్టి వేసిన దాఖలాలు లేవన్నారు. ప్రజలు ఆలోచించాలన్నారు. కరెంటు చార్జీలు, కరెంటు కోతలు, ఆర్టీసి చార్జీలు పెంపు, తదితర టాక్స్‌లతో ప్రజల నడ్డి విరిస్తున్నారన్నారు. ఈ వార్డులో పర్యటిస్తుంటే అడుగడుగునా మహిళలలో తెలుగుదేశం పార్టీ పట్ల మంచి స్పందన లభిస్తుందన్నారు. రానున్న ఎన్నికలలో చంద్రబాబును గద్దెనెక్కించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కావలి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, పట్టణ ఉపాధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, వార్డు పార్టీ కన్వీనర్ గుండ్లపల్లి రమణయ్య, టిడిపి నేతలు పోతుగంటి శ్రీకాంత్, దామా సుబ్బారావు, మహబూబ్‌బాషా, గుండ్లపల్లి శివాజీ, 3వ వార్డు అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు, పొన్నాతి భాస్కర్, గయాజ్, ఎజాజ్, శ్రీనివాసులురెడ్డి, నలమోతు శ్రీను, గొట్టిపాటి రాము, అంబటి కిషోర్, జి.వి.సురేంద్ర, యానాదినాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## కామాక్షితాయి సేవలో పారిశ్రామికవేత్తలు



**బుచ్చి నవంబర్ 17 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయిని పారిశ్రామికవేత్తల కుటుంబసభ్యులు ఇ.పద్మ, విజయలక్ష్మీ, లతారంగ, భూలక్ష్మీ, ఎస్.పద్మ, వసుందర, శుక్రవారం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రమణ్యం నాయుడు దంపతులు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి విరుపార్ఝుల గిరికృష్ణ అతిథులను స్వాగతించి వారి గోత్రనామాలతో పూజలు చేయించి వారికి తీర్ధ ప్రసాదాలు అందజేశారు.

## కండలేరు ఆయకట్టుకు రెండు టిఎంసిల నీరు ఇస్తాం



**మనుబోలు, నవంబర్ 17, ప్రభాత వార్త :** మండలంలోని కండలేరు ఆయకట్టుకు రెండు టిఎంసి ల నీరు విడుదల చేయడానికి నిర్ణయం తీసుకున్నట్లు ఇరిగేషన్ డిఈఈ కె.విజయ్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన మనుబోలు స్థానిక ఎంపిడిఓ కార్యాలయంవద్ద శుక్రవారం సాయంత్రం ఆయకట్టు రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోటు వర్షపాతం వలన ఈ పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. శ్రీశైలం జలాశయంలో నీరు అడుగంట్టాయనీ ,తెలుగుగంగ ద్వారా రెండు టిఎంసిల నీరు ను రెండు రోజుల్లో విడుదల చేస్తామనీ తెలిపారు. కండలేరు ఆయకట్టు రైతులు ఎలాంటి గొడవలు పెట్టుకోకుండా, నీరును సద్వినియోగం చేసుకొని, పంటను పండించుకోవాలనీ కోరారు. ఇరిగేషన్ డిఈఈ అనీల్‌రెడ్డి, ఎఈలు వేమారెడ్డి, ప్రసాద్, ఎఎస్‌కె జకీర్, ఎఎఓ కళారాణి తదితరులు పాల్గొన్నారు.

## సంగంలో ఘనంగా నాగుల చవితి వేడుకలు



**సంగం నవంబర్ 17 ప్రభాతవార్త** నాగుల చవితి సందర్భంగా సంగం మండలంలోని పుట్టలన్ని మహిళలు, చిన్నారులతో కళకళలాడుతు కనిపించాయి. మహిళలు వేకోజామునే లేచి స్నానమాచరించి అత్యంత భక్తి శ్రద్దలతో పుట్టల వద్ద దారులు కట్టి, పుట్టలో పాలుపోసి పూజలు చేసి మొక్కులు తీర్చుకు న్నారు. మండలకేంద్రమైన సంగంలోని శివాలయంలో నాగశిలల వద్ద అత్యంత భక్తి శ్రద్దలతో పూజలు చేశారు. అన్నారెడ్డిపాళెం గ్రామంలో పోలేరమ్మ తల్లి సన్నిధిలో ఉన్న పుట్టకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. దువ్వూరు, సిద్దీపురం తదితర గ్రామాలలో మహిళలు పొట్టల వద్ద బారులు తీరారు. వివాహం కాని యువతులు, సంతానం లేని వారు పుట్టల వద్ద మొక్కుకున్నారు. కోర్కెలు తీరినవారు మొక్కులు తీర్చుకున్నారు. పుట్టలన్ని మహిళలతో కళకళలాడుతు కనిపించాయి.

## ఆర్యవైశ్య మహాసభ అనుభందంగానే అర్బన్ ఆర్యవైశ్యసంఘం పనిచేస్తుంది



**నెల్లూరు, నవంబరు17 ప్రభాతవార్త-విద్య** ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు ముక్కాల ద్వారకానాద్ ఆధ్వర్యంలో అనుభందంగానే తమ సంఘం పనిచేస్తుందని అర్బన్ ఆర్యవైశ్యమహాసభ జిల్లా అధ్యక్షులు పేర్ల సీతారామరావు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని స్థానిక స్టాన్‌హౌస్‌పేట లోని వైశ్యభవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు 125 సంవత్సరాల చరిత్ర కలిగిన ఆర్యవైశ్య మహాసభ , దాని అనుభంధ సంస్థగా గత70 సంవత్సరాలుగా ఆర్యవైశ్య సంఘం జిల్లాలోని అర్యవైశ్యులకు ఎన్నో విధాలుగా సేవలు అందించిందన్నారు. ఆర్థింగా, సామాజికంగా, రాజకీయంగా, ప్రోత్సాహన్ని అందిస్తు వారి అభ్యుతనికి పాటుపడిందని తెలిపారు. ఆర్యవైశ్యమహాసభ సూచించిన సేవా కార్యక్రమాలు, ప్రోత్సాహక కార్యక్రమాలను తూచా తప్పకుండా నేటి వరకు తాము పాటిస్తున్నామన్నారు. ఇటీవల కొందరు తమ సంఘం, ఆర్యవైశ్య మహాసభ పేర్లకు మచ్చవాటిల్లేలా ప్రవర్తించటం విచాకరమన్నారు. వారికి వారే నాలుగు గోడల మద్య అధ్యక్షులు ఎంపిక జరిగిపోయినట్లు నియాకమ పత్రాలు ఇచ్చిపుచ్చుకోవటం సిగ్గుచేటన్నారు. జిల్లాలో వారు వైశ్యుల అభివృద్ధికిచేసిన సేవలు శూన్యమన్నారు. తీనిని దాము తీవ్రంగా ఖండి స్తున్నామని, ఇటువంటి చర్యలు చేపట్టి తమ సంఘ ప్రతిష్టను భంగ పరచాలని భావిస్తే వారిపై కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. షెడ్యూల్ ప్రకారం అర్బన్‌ఆర్యవైశ్యసంఘంకు ఎన్నికలను నిర్వహించి నాయకులన ఎన్నుకోవటం జరుగుతుందని పేరొ ్కన్నారు. ఈ కార్యక్రమంలో బైసాని జ్యోతి ప్రసాద్, కామేశ్వ రావు, తాతా కిషోర్, శ్రీకాంత్, నిరంజన్, సత్య, చందు, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

## సంగం గ్రందాలయాన్ని తనీఖి చేసిన రాష్ట్ర డిప్యూటి డైరక్టర్

**సంగం నవంబర్ 17 ప్రభాతవార్త** సంగం గ్రందాలయాన్ని రాష్ట్ర డిప్యూటి డైరక్టర్ అహ్మద్ తనీఖి చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు జల్లా వ్యాప్తంగా 56 వ గ్రందాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రందాలయ వారోత్సవాలలో భాగంగా విద్యార్దులకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రందాలయాల మెంబర్‌షిప్ చురుకగా చేస్తున్నట్లు తెలిపారు. వారోత్సవాలలో భాగంగా వివిధ కొత్తరకాల పుస్తకాల ప్రదర్శన చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్దులు చిన్నతనం నుండే గ్రందాలయాలు అలవాటు చేయాలని అన్నారు. జిల్లాలో 65 శాఖా గ్రందాలయాలలో గ్రంధాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట లైబ్రిరియన్ రవీంద్రరెడ్డి ఉన్నారు.

## భక్తిశ్రద్ధలతో నాగులచవితి



**అనుమసముద్రంపేట, నవంబర్17, ప్రభాతవార్త :** ఏఎస్‌పేట మండలంలోని వివిధ గ్రామాల్లో నాగుల చవితి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహిం చారు. ఈసందర్బంగా ఏఎస్‌పేట లోని బ స్టాండ్ సమీపంలో ఉన్న పుట్ట వద్దకు మహి ళలు అధిక సంఖ్యలోమహిళలు వెళ్ళి ఉద యం నుడి మహిళలు ఉపవాసాలు ఉండి పట్టు వద్దకు వెళ్ళి పుట్టకు చుట్టూ దారం చుట్టి పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో మహిళలు పుట్ట వద్దకు వెళ్ళి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.